క్లుప్తంగా

కేంద్ర ప్రభుత్వ విధానాలపై నిరసన

మంగళగిరి: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలపై కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం నిరసన తెలిపారు. ఇంటింటికి కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు షేక్ సలీమ్, కుప్పాల శ్రీరామమూర్తి, పఠాన్ సుభాని, దర్శనపు శామ్యూల్, కొప్పాకుల కృష్ణార్జున చౌదరి, రెమిడిశెట్టి హనుమంతరావు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి బహూకరణ



దుగ్గిరాల(తాడేపల్లి రూరల్): మండల పరిధిలోని ఈమని జిల్లా పరిషత్ పాఠశాల పదో తరగతి విద్యార్థులకు అవసరమైన సామగ్రిని సోమవారం అందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఏడుకొండలు మాట్లాడుతూ దాత చుండూరు సుబ్బారావు సహకారంతో పదో తరగతి పరీక్షలు రాయడానికి అవసరమైన జామెంట్రీ బాక్సు, రైటింగ్ ప్యాడ్, రెండు పెన్నులను 71 మంది విద్యార్థులకు అందజేశామని అన్నారు. కార్యక్రమంలో చుండూరు సుబ్బారావు, ఉపాధ్యాయులు ఫణి, సరోజ, బ్రహ్మేశ్వరరావు, ప్రకాశరావు, బాలకృష్ణ, వాసు, రాజశేఖర్ పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు

ఫిరంగిపురం: మండలంలోని యర్రగుంట్లపాడు గ్రామంలో ఇటీవల నిర్వహించిన గడప గడపకు మన కార్యక్రమంలో తాగునీటి సమస్యతో ఇబ్బందులుపడుతున్నామని వైఎస్సార్ సీపీ అదనపు సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్‌కు దృష్టికి ప్రజలు తీసుకొచ్చారు. దీంతో స్పందించిన ఆయన రోడ్డుకు ఇరువైపులా పైపులైన్‌కు మరమ్మతులు నిర్వహించాలని సూచించారు. సోమవారం గ్రామంలోని రోడ్డుకు ఇరువైపులా పైపులైను మరమ్మతులు చేపట్టారు.

పాఠశాలలో ఉగాది వేడుకలు

ఫిరంగిపురం: మండలంలోని వేమవరం ప్రాథమిక పాఠశాలలో శోభకృత్ నామ సంవత్సర ఉగాది వేడుకలు సోమవారం నిర్వహించారు. ఈసందర్భంగా ఉపాధ్యాయులు విద్యార్థులకు ఉగాది విశిష్టత గురించి వివరించారు. కార్యక్రమంలో తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ రామిరెడ్డి, హెచ్ఎం రీటామరియ, దివి కమల్‌మోహన్ పాల్గొన్నారు.

స్వచ్ఛత పురస్కారాలకు దరఖాస్తులు ఆహ్వానం

మంగళగిరి: మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలో సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌లో ప్రతిభ కనపరచిన మహిళలకు స్వచ్ఛత పురస్కారాల అందించేందుకు దరఖాస్తు చేసుకోవాలని కార్పొరేషన్ కమిషనర్ యు.శారదాదేవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వ్యక్తిగత, స్వయం సహాయక సంఘాలు, చిన్నతరహా పరిశ్రమలు, సామాజిక మరుగుదొడ్ల నిర్వహణ,సెప్టిక్ ట్యాంకుల శుభ్రత, చెత్త సేకరణ, చెత్తతో కళాకృతుల తయారీ, తడి చెత్త వినియోగం వంటి విభాగాలలో స్వచ్ఛత పురస్కారాలు అందజేయనున్నటుపేర్కొన్నారు. ఆసక్తి కలిగిన మహిళలు ఈనెల 22వ తేదీ లోగా దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. పురస్కారాలకు ఎంపికైన వారికి జూన్ 5వ తేదీ ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా పురస్కారాలు అందజేయనున్నట్లు పేర్కొన్నారు.

క్షయ వ్యాధిపై విద్యార్థులకు అవగాహన

దుగ్గిరాల(తాడేపల్లి రూరల్): మండల పరిధిలోని తుమ్మపూడిలోని మార్తా కాలేజ్ ఆఫ్ నర్సింగ్‌లో సోమవారం క్షయవ్యాధిపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. తెనాలి టీబీ యూనిట్ సూపర్‌వైజర్ పి.రవికుమార్ మాట్లాడుతూ క్షయ వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహారాన్ని కూడా పంపిణీ చేస్తున్నామని అన్నారు. వ్యాధిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మార్తా కాలేజ్ ఆఫ్ నర్సింగ్ కరస్పాండెంట్ వై. ఈశ్వర్, డీపీఎంఓ శ్యామ్ పాల్గొన్నారు.

భూముల రీ సర్వేను వినియోగించుకోవాలి

దుగ్గిరాల తహసీల్దార్ మల్లేశ్వరి

తాడేపల్లి రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ప్రాంతంలోని భూములను మీ భూమి – మీ హక్కు పథకం కింద రీ సర్వే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ ఉపయోగించుకోవాలని దుగ్గిరాల తహసీల్దార్ మల్లేశ్వరి అన్నారు. సోమవారం దుగ్గిరాల మండల పరిధిలోని కంఠంరాజు కొండూరులో భూ రీసర్వేపై రైతులతో, గ్రామస్తులతో సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బ్రిటీష్ కాలంనాటి రికార్డులను మార్చేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని చెప్పారు. ప్రతి గ్రామంలోనూ భూ రీసర్వే నిర్వహించి ప్రతి రైతుకు ఒక యునిక్ నంబర్‌ను అందజేస్తున్నారని వివరించారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ గోపాల్, సర్పంచి ఉన్నం ఝాన్సీరాణి, ఎంపీటీసీ ఎస్కే సుభాని, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వరరావు, గ్రామ సర్వేయర్ బేబి బాయి పాల్గొన్నారు.

రోడ్ల నిర్మాణానికి ప్రత్యేక చొరవ

- ఇప్పటికే రూ.103 84 కోట్లతో రోడ్ల నిర్మాణం
- మరో రూ.30 కోట్లతో చేపట్టిన పనులు



ఇటీవల పూర్తయిన సుందరయ్య నగర్ రోడ్డు

మంగళగిరి: నియోజకవర్గంలో రోడ్ల నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి సారించారు. ఇప్పటి వరకు రూ.103.84 కోట్లతో 93.92 కిలో మీటర్ల రోడ్ల నిర్మాణాలు పూర్తి చేయగా కొత్తగా మరో రూ.30 కోట్లతో పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) ప్రత్యేక ప్రణాళికతో రోడ్ల నిర్మాణానికి ప్రాధాన్యం ఇస్తున్నారు. గతంలో పట్టణం శివారు కాలనీలకు రోడ్లు లేకపోగా ప్రస్తుతం తారురోడ్లు, సిమెంట్ రోడ్ల నిర్మాణాలతో ప్రజల రవాణా సౌకర్యం మెరుగుపడింది. నగర శివారు కాలనీలైన రత్నాల చెరువు, శ్రీ లక్ష్మీనృసింహస్వామి కాలనీలు ఏర్పడి దశాబ్దాలు గడుస్తున్నా సరైన రోడ్డు మార్గం లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. స్పందించిన ఎమ్మెల్యే రోడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకున్నారు. నగరంలో విలీనమైన గ్రామాలైన ఆత్మకూరు, కాజ, చినకాకాని, యర్రబాలెం, నవులూరు, నిడమర్రు, బేతపూడి, పెదవడ్లపూడి, చినవడ్లపూడి, నూతక్కి, రామచంద్రపాలెం, చిర్రావూరు, ప్రాతూరు, కుంచనపల్లి, ఇప్పటం, మెల్లెంపూడి, వడ్డేశ్వరం, ఉండవల్లి, పెనుమాక, తాడేపల్లి ప్రాంతాలలో ప్రధాన రోడ్ల నిర్మాణంతో పాటు పొలాల్లోకి డొంక రోడ్ల నిర్మాణాలు ఇప్పటికే కొన్ని పూర్తి కాగా మరికొన్ని రోడ్ల నిర్మాణాలు శరవేగంగా కొనసాగుతున్నాయి.

రూ.52 కోట్లతో ఆర్అండ్‌బీ రోడ్లు..

నియోజకవర్గంలో 63 కిలోమీటర్ల మేర రూ.52 కోట్ల ఆర్ అండ్ బీ నిధులతో రోడ్ల నిర్మాణాలు శరవేగంగా కొనసాగుతున్నాయి. అందులో రూ.23 కోట్లతో నిడమర్రు, తాడికొండ 16 కిలోమీటర్లు, రూ.12 కోట్లతోదుగ్గిరాల మండలం రేవేంద్రపాడు, సీతానగరం వరకు 6 కిలోమీటర్లు, రూ.8.36 కోట్లతో మరో 5 రోడ్లు నియోజకవర్గంలో శరవేగంగా కొనసాగుతున్నాయి. దుగ్గిరాల మండలం చిలువూరు, పెద కాకాని మండలం నంబూరు రూ.2.20 కోట్లతో 7 కిలోమీటర్లు, రూ.50లక్షలతో మెల్లెంపూడి– గుండిమెడ 2 కి.మీ. రోడ్డు నిర్మాణం చేస్తున్నారు.

ఆదర్శంగా నగరం తీర్చిదిద్దుతాం



మంగళగిరి– తాడేపల్లి నగరాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దడం లక్ష్యంగా పనిచేస్తున్నాం. పెరగనున్న జనాభాను దృష్టిలో పెట్టుకుని రోడ్ల విస్తరణ, మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నా. అభివృద్ధి చెందాలంటే ప్రధానంగా రోడ్ల విస్తరణ, రోడ్ల నిర్మాణం అవసరం. ఇప్పటికే అనేక రోడ్ల విస్తరణ చేపట్టాం. త్వరలోనే మరి కొన్ని రోడ్ల విస్తరణతో పాటు నగరం నలుమూలల ప్రజలకు కనెక్టవిటి ఉంటే రోడ్ల నిర్మాణాలు చేపట్టనున్నాము.

–ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే), ఎమ్మెల్యే

రైతు సమస్యలకు సజీవరూపం సంఘర్షణ



మాట్లాడుతున్న సాహితి విశ్లేషకులు ఏ రాజాహుస్సేన్

మంగళగిరి: అభ్యుదయ కవి గోలి మధు రచించిన కవితా సంపుటి సంఘర్షణ రైతు సమస్యలకు సజీవ రూపం అని ప్రముఖ సాహితీ విశ్లేషకులు ఏ రాజాహుసేన్ కొనియాడారు. గోలి వారి వీధిలోని కవి గోలి మధు నివాసంలో సంఘర్షణ కవితా సంపుటిపై చర్చా కార్యక్రమం ఆదివారం రాత్రి నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన రాజా హుసేన్ మాట్లాడుతూ మధు కవిత్వ రచనలో కొంత సంయమనం పాటిస్తే భవిష్యత్‌లో గొప్ప కవి కాగలడన్నారు. మధు రైతు సమస్యలపై ప్రధానంగా సంపూర్ణ కావ్యం రాయడంతో పాటు చేనేత పరిశ్రమ, కార్మికులపై మరిన్ని కవితలు రాయాలన్నారు. కార్యక్రమంలో సీజే జూనియర్ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ మంచా విజయ్‌మోహన్ రావు, మానవ వికాస మండలి కన్వీనర్ రేఖా కృష్ణార్జునరావు, మంగళగిరి సాహితి వేదిక కన్వీనర్ గుత్తికొండ ధనుంజయరావు, కళా పోషకులు దామర్ల కుబేరస్వామి, తాటిపాముల లక్ష్మీపెరుమాళ్ళ, రేకా సుధాకరరావు, డాక్టర్ ప్రత్యూష సుబ్బారావు, కంచర్ల కాశయ్య పాల్గొన్నారు.

పలు కుటుంబాలకు ఆర్థిక సాయం



దుగ్గిరాల(తాడేపల్లి రూరల్): దుగ్గిరాల మండలంలో పలువురికి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) అందించిన ఆర్థిక సహాయాన్ని సోమవారం అందజేశారు. దుగ్గిరాల ఎస్టీ కాలనీకి చెందిన వృద్ధురాలు సింగంశెట్టి పుష్పలతకు రూ.10 వేలు, రోడ్డు ప్రమాదంలో గాయపడిన ముర్తుజానగర్‌కు చెందిన టైలర్ షేక్ మస్తాన్‌కు రూ.20 వేలు, అదే ప్రాంతానికి చెందిన షేక్ మస్తాని అనారోగ్యంతో బాధపడుతుండడంతోరూ.10 వేలు అందించారు. కార్యక్రమంలో ఎంపీపీ దానబోయిన సంతోష రూపవాణి, జెడ్పీటీసీ సభ్యురాలు మేకతోటి అరుణ, వైఎస్సార్‌సీపీ నాయకులు కంభంపాటి క్రాంతి కుమార్, షేక్ సుభాని, రఘు యాదవ్, మోరంపూడి ఎంపీటీసీ కూచిపూడి సురేష్, దుగ్గిరాల పంచాయతీ సభ్యురాలు షేక్ రిజ్వానా, షేక్ వాహబ్, జలీల్, మనీర్ పాల్గొన్నారు.

తాడేపల్లి రూరల్: మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని ఉండవల్లికి చెందిన ఈమని కోటిరెడ్డి అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. వారి కుటుంబానికి వైఎస్సార్ బీమా కింద తక్షణమే గ్రామ సచివాలయ సిబ్బంది సోమవారం ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో వెల్ఫేర్ సెక్రటరీ శ్రీనివాసరావు, ఇంజినీరింగ్ సెక్రటరీ సాయితేజ పాల్గొన్నారు.

ఎయిమ్స్ సెక్యూరిటీ సిబ్బంది వినూత్న నిరసన



తాడేపల్లి తహసీల్దార్ కార్యాలయం వద్ద రోడ్డుపై కరపత్రాలు పంచుతున్న ఎయిమ్స్ సిబ్బంది

తాడేపల్లి రూరల్: నగరపాలక సంస్థ పరిధిలోని ఎయిమ్స్‌లో పనిచేస్తున్న సెక్యూరిటీ సిబ్బందిని విధుల నుంచి తొలగించడంతో సోమవారం వినూత్నంగా నిరసన తెలిపారు. ఆందోళన కార్యక్రమంపై కరపత్రాలు పంపిణీ చేశారు. నులకపేట తహసీల్దార్ కార్యాలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో సెక్యూరిటీ అధ్యక్షుడు జి.కోటేశ్వరరావు మాట్లాడుతూ ఎయిమ్స్ హాస్పిటల్‌లో పనిచేస్తున్న సెక్యూరిటీ సిబ్బందిని ఎటువంటి సమాచారం, నోటీసులు లేకుండా తొలగించారని చెప్పారు. హాస్పిటల్‌లో జాయింట్ సూపరిండెంటెండ్ డాక్టర్ రామమోహన్, సెక్యూరిటీ సూపర్‌వైజర్ బత్తినేని హరికృష్ణ తమకు నచ్చిన వారిని పనిలో పెట్టుకుని మిగిలిన వారికి తొలగించడం దారుణమని అన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి శివశంకర్, మంగళగిరి సీఐటీయూ అధ్యక్షుడు కమలాకర్ పాల్గొన్నారు.

లేగదూడపై కుక్కల దాడి

తాడేపల్లి రూరల్: నగరపాలక సంస్థ పరిధిలోని కొలనుకొండలో వీధి కుక్కలు లేగదూడపై దాడిచేసి గాయపరిచిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. సేకరించిన వివరాలు.. కొలనుకొండ సచివాలయం ఎదురుగా నివాసముంటే సామాల మోహనరావు పాడిగేదెకు నాలుగు నెలల క్రితం పెయ్యదూడకు జన్మనిచ్చింది. గేదెలను పచ్చిమేత కోసం పొలానికి వదలగా, దూడను ఇంటివద్ద కట్టివేశాడు. ఇదే సమయంలో అక్కడ ఉన్న వీధి కుక్కలు దూడపై దాడిచేసి గాయపరిచాయి. కుక్కలు వెనుక తోకను పట్టుకుని పళ్లతో కొరికి తెగిన తోకను తీసుకుని పారిపోయాయి. బాధతో దూడ గట్టిగా అరవడంతో మోహనరావు బయకు వచ్చి చూడగా దూడ తోక తెగిపోయి రక్తం కారడం గమనించాడు. వెంటనే దూడకు వైద్యం కోసం పశువైద్యులను సంప్రదించి వైద్యం చేయించాడు. వీధి కుక్కల వలన తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నామని, కార్పొరేషన్ అధికారులు వాటిని నివారించేలా చర్యలు తీసుకోవాలని మోహనరావు కోరారు.

వర్షాల కారణంగా దెబ్బతిన్న పంటల పరిశీలన



దుగ్గిరాల(తాడేపల్లి రూరల్): అకాల వర్షానికి దుగ్గిరాల మండల తుమ్మపూడి, చిలువూరు గ్రామాల్లో దెబ్బతిన్న పంటపొలాలను సోమవారం రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జొన్నా శివశంకరరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అకాల వర్షాల కారణంగా దెబ్బతిన్న జొన్న పంటకు రూ.40 వేలు, మొక్కజొన్న పంటకు రూ.50 వేలు నష్ట పరిహారాన్ని ప్రకటించి వెంటనే ఇవ్వాలని కోరారు. అదే విధంగా దెబ్బతిన్న పసుపు, అరటి, మిర్చి, పెసర తదితర పంటలకు కూడా బీమా ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామని చెప్పారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు, బాలరాజు, కౌలు రైతు సంఘం కార్యదర్శి నాగమల్లేశ్వరరావు, కార్యదర్శి వై.బ్రహ్మేశ్వరరావు, అమ్మిరెడ్డి యోహాను పాల్గొన్నారు.

ఇంటి నంబరు లేక అగచాట్లు

- ఇళ్ల స్థలాలు ఇచ్చారు.. పట్టాలు మరిచారు
- స్పందన సమావేశంలో అర్జీదారుల ఆవేదన



సబ్ కలెక్టర్‌కు సమస్య వివరిస్తున్న మహిళలు

తెనాలి: పట్టణ గురవయ్య కాలనీ శివారు పూలే కాలనీలో నివసిస్తున్న తమకు పట్టాల లేదా బీఫారాలు ఇప్పించాలని కోరుతూ ఆ కాలనీకి చెందిన మహిళలు తెనాలి సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం జరిగిన స్పందనలో అర్జీనిచ్చారు. సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ స్వీకరించారు. గతంలో స్థానిక వైకుంఠపురం కాల్వ కట్ట పక్కన నివాసం ఉండే తమ ఇళ్లను అధికారులు ఆక్రమణలుగా గుర్తించి తొలగించినట్టు గుర్తుచేశారు. రోడ్డుపాలైన తమకు నివాస స్థలాలు కేటాయించాలని కోరుతూ 41 రోజులు నిరాహారదీక్ష చేసినట్టు తెలిపారు. ఫలితంగా అప్పటి తహసీల్దారు ఏసురత్నం దీక్ష శిబిరాన్ని సందర్శించగా, తమ ఇక్కట్లను విన్నవించామన్నారు. దీంతో ఆయన తమ 84 కుటుంబాలకు రామలింగేశ్వరపేట గురువయ్య కాలనీ శివారులోని పూలే కాలనీలోని పాత డ్రైనేజీ పథకం స్థలంలో ప్లాట్లను కేటాయించినట్టు వివరించారు. కుటుంబానికి 72 గజాల స్థలం ఇవ్వడంతో 20 ఏళ్లకు పైగా అక్కడే తాత్కాలిక ఆవాసాలతో నివాసం ఉంటున్నట్టు తెలిపారు. తమకు పట్టాలు లేకపోవడంతో డోర్ నంబరు రాలేదన్నారు. దీంతో తమ పిల్లల చదువులకు, స్కాలర్‌షిప్‌కు, ఉద్యోగాలకు అవసరమైన చిరునామా సమస్యగా మారిందని వివరించారు. పట్టాలతో పాటు రోడ్లు, మురుగు కాల్వలు, మంచినీటి పైపులైను ఏర్పాటుచేయాలని సబ్‌కలెక్టర్‌కు విన్నవించుకున్నారు. 'స్పందన'కు ఐదు అర్జీలు వచ్చాయి.

అకౌంట్ అప్‌డేట్ పేరుతో ఘరానా మోసం

- గతంలో యూపీఐ పేమెంట్స్ సంస్థలో పనిచేసిన వ్యక్తిగా గుర్తింపు
- నిమిషాల్లో నగదు మాయం

తాడేపల్లి రూరల్: పలు షాపుల యజమానుల ఖాతాల్లోని డబ్బును ఓ మోసకారి మాయం చేసిన సంఘటన సోమవారం ఉండవల్లి నాలుగు రోడ్ల సెంటర్ కూడలిలో చోటుచేసుకుంది. సేకరించిన వివరాల మేరకు.. ఉండవల్లి అమరావతి రోడ్డులో నిత్యం రద్దీగా ఉండే నాలుగు షాపులకు ఓ వ్యక్తి వెళ్లి నేను భారత్ పే నుంచి వచ్చానని, తన పేరు దుర్గా ఫణికుమార్ ప్రసాద్ అని ఐడీ కార్డు చూపించాడు. భారత్‌పే అకౌంట్ అప్‌డేట్ చేయాలంటూ వారి ఫోన్ తీసుకుని ఆ ఖాతాల్లో ఉన్న నగదును తన అకౌంట్‌కు పంపించుకున్నాడు. వెంటనే ఫోన్ ఇచ్చేసి, అర్ధగంటలో మీ ఫోన్ ఆన్ చేస్తే అప్‌డేట్ అవుతుందని చెప్పి అక్కడ నుంచి వెళ్లిపోయాడు. అలా నలుగురు వ్యాపారుల నుంచి రూ.25 వేలు తన ఖాతాకు ట్రాన్స్‌ఫర్ చేసుకుని వెళ్లిపోయాడు. మోసపోయామని గుర్తించిన వ్యాపారులు భారత్ పే సంస్థ ప్రతినిధులకు ఫోన్ చేయగా అతను మా వద్ద ఉద్యోగం మానేసి 15 రోజులు అవుతోందని తెలిపారు. మేము చేయగలిగింది ఏమీ లేదన్నారు. సదరు ఉద్యోగి దగ్గర ఐడీ కార్డును స్వాధీనం చేసుకోకపోవడం వల్లే తాము నమ్మాల్సి వచ్చిందని వ్యాపారస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

వైభవంగా మహా సుదర్శన హోమం



ఫిరంగిపురం: మండలకేంద్రంలోని రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో శోభకృతు నామసంవత్సర ఉగాది పండుగను పురస్కరించుకొని సోమవారం విశేష యాగాలు నిర్వహించారు. దేశం, రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని కోరుతూ లోక కల్యాణార్థం మహారుద్ర చండీహోమం, మహా సుదర్శన హోమం, స్నపన, తిరువంజనం నిర్వహించినట్లు నిర్వాహకులు బీవీ గౌరీశంకర్ తెలిపారు. హోమ కార్యక్రమంలో సీనియర్ ఐపీఎస్ అధికారి(ఢిల్లీ) చంద్రశేఖర్ ఆజాద్, సరితా అరుణకుమారి దంపతులు పాల్గొని పూజలు చేశారు. 18 మంది రుత్వికులు ప్రత్యేక పూజలు, విశేష అర్చనలు నిర్వహించారు. పూర్ణకుంభంతో చంద్రశేఖర్ ఆజాద్‌కు రుత్వికులు స్వాగతం పలికారు. కార్యక్రమాలను నారాయణం ప్రసాదాచార్యులు, వంశీకృష్ణ, ఈఓ గాదె రామిరెడ్డి పర్యవేక్షించారు. అనంతరం గీతాభజన మండలి ఆధ్వర్యంలో కోలాట ప్రదర్శన నిర్వహించారు.

సమస్యల పరిష్కారానికే గడప గడపకు..

- వైఎస్సార్ సీపీ అదనపు సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్
- గుండాలపాడులో గడప గడపకు మన ప్రభుత్వం



పథకాలపై అవగాహన కల్పిస్తున్న కత్తెర సురేష్‌కుమార్

ఫిరంగిపురం: ప్రజా సమస్యల పరిష్కారానికే గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అదనపు సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్ పేర్కొన్నారు. మండలంలోని గుండాలపాడులోని ఎస్టీ కాలనీ, ముస్లిం ఏరియా, దాసులకాలనీలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈసందర్భంగా సురేష్‌కుమార్ ఇంటింటికి వెళ్లి పథకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు దాసరి కత్తిరేణమ్మ, చిట్టా అంజిరెడ్డి, ఎం. సుధాకరరెడ్డి, మరియబాబు, సీతారెడ్డి, వసంతరావు, షేక్ సైదా, పిచ్చిరెడ్డి, రాజేష్, హుసేన్, ఖాసిం, సీహెచ్ కృష్ణమోహన్, టి.కృష్ణ, వై.కోటయ్య, జయరావు, జి.మస్తాన్‌వలి, బాజి. తహసీల్దార్ పద్మనాభుడు, ఎంపీడీఓ డి.అనూరాధ, ఏఓ రమణకుమార్, ఏపీఎం సుజాత, కార్యదర్శి లక్ష్మీశారద, పీఆర్ఏఈ పి.జోజప్ప, హౌసింగ్ ఏఈ శ్రీనివాసరావు, విద్యుత్‌శాఖ ఏఈ పుల్లారెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థుల్లో నైపుణ్యాలను వెలికితీయాలి



పాటలు పాడుతున్న విద్యార్థినులు

ఆత్మకూరు(మంగళగిరి): నగర పరిధిలోని ఆత్మకూరు జాతీయరహదారి వెంట ఉన్న నిర్మల ఫార్మసీ కళాశాల వార్షికోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఉన్నత విద్యాశాఖ మండలి సెక్రటరీ ప్రొఫెసర్ వై.నజీర్ అహ్మద్ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు తమలోని నైపుణ్యాలను, సృజనాత్మకతను వెలికి తీసి అన్ని రంగాలలో రాణించాలని ఆకాంక్షించారు. కష్టించే తత్వం, క్రమశిక్షణ, ఎదుటవారిని గౌరవించడం, వ్యక్తిగత పరిశీలన అంశాలు ఎంతో ముఖ్యమని ఈ లక్షణాలు అలవవరుచుకున్న వారు జీవితంలతో ఉన్నత స్థానాలు చేరుకుంటారన్నారు. ఈసందర్భంగా విద్యార్థిని, విద్యార్థులు ప్రదర్శించిన ఆటల పాటలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ సిస్టర్ జి.జాన్‌పాల్, ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ రహమాన్, సెక్రటరీ జి.నిర్మలజ్యోతి పాల్గొన్నారు.

జాతీయ మూట్ కోర్టులో కేఎల్‌యూకు అవార్డు



అవార్డులు సాధించిన కెఎల్‌యు విద్యార్థులు

తాడేపల్లి రూరల్: వడ్డేశ్వరం కేఎల్ విశ్వవిద్యాలయం న్యాయ కళాశాలలో బీబీఏ చదువుతున్న విద్యార్థులు ఉత్తమ మూట్ మెమోరియల్ అవార్డు అందుకున్నట్లు న్యాయ విభాగ అధిపతి జి.విజయసుధ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తమ విశ్వవిద్యాలయంలో న్యాయ కళాశాల విద్యార్థులు ఈనెల 17 నుండి 19వ తేదీ వరకు ముంబయిలోకి కాలేజ్ ఆఫ్ లా కలంబోలిలో నిర్వహించిన జాతీయ మూట్ కోర్టు పోటీలలో అత్యంత ప్రతిభ కనబరిచినట్లు చెప్పారు. ఎస్. గణేష్ నందా, షేక్ అక్బర్, వై. రూపాంజనాశ్రీలు ఉత్తమ మూట్ మెమోరియల్ అవార్డుతో పాటు 5 వేల నగదు బహుమతి లభించిందని చెప్పారు. ఈ సందర్భంగా అవార్డు అందుకున్న విద్యార్థులను విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, ప్రొ వైస్ చాన్సలర్ డాక్టర్ ఎస్.వెంకటరామ్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎ.జగదీష్, ఎం.హెచ్.ఎస్. డీన్ డాక్టర్ ఎం. కిషోర్ బాబు, న్యాయ కళాశాల అధ్యాపకులు అభినందించారు.

నేడు ఉగాది బాలోత్సవం



సమావేశంలో మాట్లాడుతున్న సీఏపీటీ తాడేపల్లి అధ్యక్షులు జీఎస్ఆర్ మోహనరావు

తాడేపల్లి రూరల్: విద్యార్థుల్లో దాగిఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు ఎంటీఎంసీ పరిధిలోని కుంచనపల్లిలోని ఓ పాఠశాలలో ఉగాది బాలోత్సవం నిర్వహిస్తున్న కాన్ఫిడరేషన్ ఆఫ్ అపార్ట్‌మెంట్స్ అసోసియేషన్(సీఏపీటీ) తాడేపల్లి అధ్యక్షుడు జీఎస్ఆర్ మోహనరావు అన్నారు. తాడేపల్లిలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తాడేపల్లి– మంగళగిరి పరిధిలోని అపార్ట్‌మెంట్స్‌లో ఉన్న బాలల విద్యా వైజ్ఞానిక అభివృద్ధి కోసం తల్లిదండ్రులతో ఐక్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని చెప్పారు. కల్చరల్, అకాడమిక్, తదితర 25 విభాగాల్లో బేబీ జూనియర్స్, సబ్ జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో ఫ్యాన్సీ డ్రెస్, రైమ్స్, విచిత్ర వేషధారణ, క్లాసికల్ డాన్స్, దేశభక్తి గీతాలాపన, ఏకపాత్రలు, జానపద నృత్యాలు, చిత్రలేఖనం, వ్యాసరచన, వక్తృత్వం తదితర అంశాలపై పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేస్తామని అన్నారు. కార్యక్రమానికి రిటైర్డ్ ప్రిన్సిపాల్ సెక్రటటీ వి. ఉషారాణి, పర్యావరణ వేత్త డాక్టర్ తుమ్మల శ్రీకుమార్, ఆంధ్ర నాటక కళా సమితి అధ్యక్షులు నన్నపనేని నాగేశ్వరరావు, అమరావతి బాలోత్సవం కార్యదర్శి పి.మురళీకృష్ణ, మంగళగిరి తాడేపల్లి బాలోత్సవం అధ్యక్షులు వి.వి. ప్రసాద్ హాజరవుతారని చెప్పారు. అనంతరం బాలోత్సవం బ్రోచర్లను ఆవిష్కరించారు. సమావేశంలో పాఠశాల ప్రిన్సిపాల్ బి.ఇంద్రాణి, మంగళగిరి తాడేపల్లి బాలోత్సవం కార్యదర్శి పి.లక్ష్మి, ప్రజానాట్యమండలి నాయకులు కొట్టే కరుణాకరరావు, ఎస్కే కాలేషా, జి.అవినాష్ రెడ్డి, బిట్రా రామారావు, ఇర్ల వెంకటేష్, నాగరాజు, క్రాంతి పాల్గొన్నారు.

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌దే భవిష్యత్



సదస్సుకు హాజరైన ప్రొఫెసర్ శ్రీనివాసరెడ్డి, అతుల్ నేగీ తదితరులు

తాడికొండ: ఆధునిక సమకాలీన ప్రపంచంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మరియు సిగ్నలింగ్ వ్యవస్థ సామాజిక, పారిశ్రామిక రంగాలలో సమస్యలను అధిగమించేందుకు ఎంతగానో దోహదం చేస్తుందని ఏఎస్‌యూ డీన్ ప్రొఫెసర్ డాక్టర్ శ్రీనివాసరెడ్డి, ఐఈఈఈ చైర్ హైదరాబాద్ సెక్షన్ అధికారి డాక్టర్ అతుల్ నేగీ అన్నారు. ఐనవోలు వీఐటీ– ఏపీ విశ్వవిద్యాలయంలో స్కూల్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్, ఐ ట్రిపుల్ ఈ సంయుక్త నిర్వహణలో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ మరియు సిగ్నల్ ప్రాసెసింగ్ పై మూడు రోజుల పాటు నిర్వహించిన అంతర్జాతీయ సదస్సు సోమవారం ముగిసింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మరియు సిగ్నల్ ప్రాసెసింగ్‌లో ఇటీవల కాలంలో జరిగిన పరిశోధనలు, అధ్యయనాలను పరిశ్రమల ప్రతినిధులు, శాస్త్రవేత్తలు నిపుణులతో చర్చించడానికి విస్తృతమైన వేదిక నెలకొల్పడమే ఈ సదస్సు ముఖ్య లక్ష్యం అన్నారు. కార్యక్రమంలో భాగంగా ఏఐఎస్‌పీ జనరల్ చైర్ డాక్టర్ రాయ్ అతిథులకు స్వాగతం పలకగా, డాక్టర్ దీపక్ కుమార్ పాండా సదస్సులో చర్చించే అంశాలు, లక్ష్యాన్ని తెలియజేశారు. కార్యక్రమంలోగౌరవ అతిథి సైంటిఫిక్ ఇన్నోవేషన్ అండ్ రీసెర్చ్ సెంటర్‌కు చెందిన డాక్టర్ యు.చంద్రశేఖర్, ఏపీ ఐటీ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీధర్ కొసరాజు, వీఐటీ– ఏపీ వర్సిటీ వీసీ డాక్టర్ ఎస్వీ కోటారెడ్డి, రిజిస్ట్రార్ డాక్టర్ జగదీష్ చంద్ర ముదిగంటి, డీన్ డాక్టర్ రవీంద్ర ధూలి, కన్వీనర్, డీన్ డాక్టర్ ఉమాకాంత్ నందా, వివిధ విభాగాల డీన్లు, అధ్యాపకులు, 200 మంది ఔత్సాహిక పరిశోధకులు పాల్గొన్నారు.